





మొత్తం పదమూడు పాయింట్ల చెక్‌లిస్ట్ ఎదురుగా పెట్టుకు కూర్చున్నాడు విశ్వం. వాటిల్లో మొదటిది, ఎడ్వర్డ్‌ముంచ్ వేసిన 'ది క్రై' పెయింటింగ్‌ను గోడకు నిలువునా వేలాడ దీయటం.

ఒక అభౌతికమైన మూడ్‌ను ఆ ప్రదేశంలో నింపడానికి. రెండోది నాటకం పేరు 'ప్రజల పిలుపు' అనుకొన్నాడు. కానీ దానికి ముందు అనుకొన్న ట్లుగా 'నేను సి.ఎంని' అనేదే బాగుందనిపించి, దాన్నే ఖరారు చేశాడు. మూడోది నటులకు ఉపన్యాసం. నాటక కళ గురించిన గంభీరమైన ఉపన్యాసం. "నాటకం ఒక యుద్ధ విద్య. నటన, సన్నివేశం, స్వరం - ఈ మూడూ సమంగా కుదరాలి. వచనం, కవిత్వంలాగా మీకు నిశ్శబ్దం, భీకరమైన కేక రెండూ తెలియాలి".

సుందరకు విసుగేసింది. గదిలోంచి బయటకు వచ్చి వరండాలో కూలబడ్డాడు. స్క్రిప్ట్ తీసి డైలాగులు పెద్దగా చదవటం మొదలుపెట్టాడు. గొంతులో ప్రవక్తల మార్దవాన్ని చూపాలని, కానీ అతనికి తెలియకుండానే ఒక ధిక్కారం, అసహనం గొంతులోకి దుండగుల్లా ప్రవేశించి మాడ్యులేషన్ కుదరటం లేదు.

లోపల విశ్వం 'ఫిలాసఫీ ఆఫ్ డ్రామా' చెబుతూనే ఉన్నాడు. "నాటకం అంటే సమూలంగా నాశనం చెయ్యడం, నాశనం చేసే క్రమంలో నాటకాన్ని రాస్తాం. మాటల్ని కుక్కి నకిలీ మానవుణ్ణి సృష్టిస్తాం. ఉత్తుత్తి గాయాలు చేసుకొని."

సుందరకు అసహనంగా ఉంది. ఆ మాటలు వినకుండా ఉండాలని ప్రయత్నం - విశ్వాన్ని, రూమ్‌ని, గొడవను మర్చిపోయి మెల్లగా సి.యమ్. పాత్రను శరీరంలోకి ప్రవేశ పెట్టుకొన్నాడు. తనను ఆ పాత్రగా డిక్లేర్ చేసుకొన్నాడు. పాత్ర శరీరంలోకి ప్రవేశించేకొద్దీ - సుందర ధ్వంసం కావటం గమనించాడు. సుందర చుట్టూ కృత్రిమమైనవి, పాత్రకే స్వంతమైనవీ మూడ్స్, మెల్లగా మూగటం మొదలుపెట్టాయి. జనం హాహాకారాలు, జైజైలు, అధికార భవనాలు, రాజముద్రలు, పొగడ్తలు, పూలదండలు, బొటనవేలు కింద సన్నని బంతిలాగా భూగోళం నిలిచిన భ్రాంతి - ఒక పవర్‌లోకి, అరిస్టోక్రసీలోకి అడుగుపెట్టాడు సుందర. గతంలో చాలా పాత్రల్ని ఇట్లాగే తన శరీరంలోకి ప్రవేశ పెట్టుకొనేవాడు. షూమేకర్, లాండ్రీ మనిషి, దొంగ, చర్చి ఫాదర్, ఖైదీ,

మహాకవి - కానీ ఇట్లా తను మొత్తంగా విధ్వంసం అయిన సందర్భాలు లేవు. సియమ్ పాత్ర శరీరంలోకి ప్రవేశపెట్టగానే - సుందర భయంతో కంపించిపోతు న్నాడు. ముప్ఫయేళ్ళ గవర్నమెంటు సర్వీసులో అతనికి అంటుకొన్న భయం, కంగారు - యాభైయేళ్ళ ముసలి శరీరపు వణుకు, నీరసం అన్నీ సుందరను చుట్టుముట్టాయి.

"ఈ పాత్ర వెయ్యటం కాదుగానీ, ఇది ఖచ్చితంగా 'ది డెత్ ఆఫ్ సుందర'గా ముగిసేలా ఉంది. ఈ పాత్ర పూర్తయినాక బహుశా ఒక అనాథ శవంలా నేను మిగిలిపోవచ్చు" అని గట్టిగా స్వగతంలాగా అనుకొన్నాడు సుందర.

లోపల గది రాజకీయ సభ అయింది. బల్లపై కూర్చున్న విశ్వం - చేతిలో బీరునింపిన గాజుమగ్గు, చుట్టూ కుర్రవాళ్ళు - బోస్, గంగాధర్, సురేష్, పరాశరావు - డైలాగులు వల్లె వేస్తున్నారు. మాస్ మిమిక్రీలాగా తమాషాగా ఉంది. రోడ్డుపై దూరంగా ఒక మగవాడు, ఆడమనిషి - రోడ్డుపై అన్నీ అదృశ్యమై వాళ్లిద్దరు - సన్నటి నవ్వో, ప్రేమపూరితమైన సంభాషణో, వాళ్ళమధ్య నుంచి దొర్లి, రోడ్డు పైనంతా అటు ఇటు కలదిరుగుతూ - కొత్త భాష, అపరిచితమైన అక్షరాలు - ఆ అజ్ఞాత భాషను అనువదించాలని సుందర ముచ్చటపడ్డాడు. ఆ దృశ్యమంతా రంగుల పెయింటింగ్‌లా తోచింది. ఇటు లోపల గదిలో డైలాగులు, అరుపులు, పూర్వవైభవాల ప్రస్తావన, అనార్కిస్టుల కాంప్‌లా ఉంది.

సుందర వంతు వచ్చింది. డైలాగులు చదవమని విశ్వం ఆదేశించాడు. సుందర గొంతు విప్పాడు. "నీ చుట్టూ ఉన్న బోను నువ్వే మూసేసుకోవాలి. తప్పదు. ప్రపంచం ఇట్లాగే ఉంది. కాలం కూడా. మనం కూడా కొన్ని త్యాగాలు చెయ్యవద్దా!" సుందర గొంతు పెద్దగా అరిచినట్లుగా ఉంది. "స్ప్లెండిడ్!" విశ్వం ఉత్సాహపరిచాడు. "కమాన్! ఇంకా ఉద్రేకం కనబడాలి. పవర్ కన బడాలి" అన్నాడు. సుందరలో ఉత్సాహం రగిలింది. గొంతు విప్పి మిలిటరీ కమాండ్‌లాగా, తరువాత డైలాగు "నేను సి.యమ్.ని!" అని పెద్ద కేకతో చెప్పబోయి -

హఠాత్తుగా సుందర గొంతు బిగుసుకుపోయింది. గొంతుకు నిద్ర కమ్మినట్లుగా, పెరాలిసిస్ వచ్చినట్లు - "కంఠంలో హారర్ కనబడాలి!" విశ్వం అరుస్తున్నాడు. "హౌల్, హౌల్‌లా పెనుకేక" విశ్వం ఉద్రేకపరుస్తూనే ఉన్నాడు.

"గొంతు చచ్చిపోయింది" సన్నగా పీలగా అన్నాడు సుందర. లోప లెక్కడో రహస్య గాయం. ఇదంతా పదాలతో చేస్తున్న వ్యభిచారంలా తోచింది. "నేకింక వెళతాను" అంటూ బయల్దేరాడు సుందర.

'రేపు, మళ్ళీ కలుద్దాం. మాన్యుస్క్రిప్ట్ అంతా మళ్ళీ చదువు. కేకను ప్రాక్టీసు చెయ్యి'' విశ్వం అరుస్తున్నాడు. గోడపైకి విసిరివెయ్యబడ్డ పోస్టర్‌లా వీధిలోకి వచ్చాడు.

*　　*　　*

సుందరగా అతను చాలామందికి తెలుసు. సుందర అనే ఈ మూడు హల్లుల చిన్నపదం - రకరకాల సందర్భాలలో రకరకాలుగా ఉచ్చరింపబడి- ఇష్టంగా, కోపంగా, తిట్టులా, జోక్‌లా, చాదస్తానికి ప్రతీకగా, ఎంతగానో దుర్వినియోగం చెయ్యబడింది. సుందర పదంతోపాటు ఎదుటివాళ్ళ ముఖ కవళికలు, స్వరంలోని ఊర్ధ్వపతనాలు - సుందరలోని నటుడికి గొప్ప ఎడ్యుకేషన్. సుందర నటుడు, కారెక్టర్ యాక్టర్, కమేడియన్. "అడుగోరా సుందర'' అంటూ జనం ప్రేమగా అరిచే పరిషత్తు నాటకాల రోజులు కావివి. ఇప్పుడు టి.వి.నాటకాల్లో ఒక నిముషం, రెండు నిముషాలు పాత్రల్లో మాత్రమే కనిపిస్తున్నాడు సుందర. గంభీరమైన స్వరంతో తీర్పు చెప్పే ముసలి జడ్జిలా, నీతిబోధలు చేసే తాతయ్యగా మాత్రమే తెలుసు. జనన మరణాల ఆఫీసులో క్లర్కుగా ఎక్కువమందికి తెలిసినవాడు సుందర. "సుందర! యూ మైండ్‌లెస్ బ్రూట్! ఓల్డ్ పిగ్!'' అంటూ రిజిస్ట్రార్ రోజుకోసారయినా అరుస్తాడు. రిజిస్ట్రారు గొంతులోని ఎమోషన్‌కి పేరు పెట్టడానికి ప్రయత్నిస్తాడు సుందర. నియంత కంఠంలోని పొగరు, అధికారం కనిపిస్తాయి ఆ గొంతులో. అంత బేస్ వాయిస్‌తో, అంత సహజంగా అతనట్లా పలకటం సుందరకు గొప్ప ఆశ్చర్యం. ఆ మహత్యం కుర్చీదా అధికారానిదా లేదా ఆ మనిషిలోనే సహజంగా ఉన్నదా అని ఆశ్చర్య పోతాడు సుందర. ఈ రిజిస్ట్రార్ సుందరకు రెండు ఎదురుచూడని ఆపదల్ని తెచ్చిపెట్టాడు. మొదటి ఆపద 'నేను సియమ్‌ని' అనే నాటకం వెయ్యమని ఆదేశించటం. 'ప్రజల కొరకు ప్రభుత్వం', 'ప్రభుత్వ విజయాలు ప్రజల కోసమే' వగైరా నినాదాలలో భాగంగా, ఈ నాటకం.

సుందరకు ఎదురైన రెండో ఆపద కంప్యూటరు. అరలు అరలుగా గోడల పొడవునా సర్దబడ్డ రిజిష్టర్లనన్నింటిని కిందకు తోసి, వాటన్నిటిని కంప్యూటరులోకి ఎక్కించే ప్రయత్నం. గోడలన్నీ కూల్చివేసి, ఆఫీసును కంప్యూటర్ రూమ్‌గా మార్చే ప్రయత్నం. మరింక సుందరలాంటి వాళ్ళ అవసరం లేదని వి.ఆర్.ఎస్. తీసుకొని ఇంటికి వెళ్ళమని బెదిరిస్తున్నారు. యుద్ధస్థలంగా ఉంది ఆఫీసు. మృతభూమిలా చెల్లాచెదురైన ఫైళ్ళు. మొత్తం మానవజాతి చరిత్ర ధ్వంసం అయిపోయినట్లుగా వణికిపోయాడు సుందర.

ఎత్తైన రాక్‌లు, వాటిలోని జనన మరణాల రిజిష్టర్లు, మానవ సమాజం, కుదించబడి, అరల్లో వరుసగా సర్దబడినట్లుగా భావిస్తాడు సుందర.

సుందరకు ఒక్కో అరొక రంగస్థలంగా తోస్తుంది. అరల్లో సర్దబడిన వేలాది ఆత్మల్ని అట్లా చేతుల్తో స్పర్శిస్తూ - సుందరలోని మహానటుడు బయటకు వస్తాడు. కింగ్‌లియర్‌లాగానో, మాక్‌బత్‌లానో, ఇనుప తెరలులో ఇన్‌స్పెక్టర్‌లానో, మాభూమిలో జమిందారులానో - సుందర రూపురేఖలు, కంఠస్వరం, ఆహార్యం అన్నీ మారిపోతాయి. ముఖ్యంగా తనో వందల వేల మానవులకు - ప్రతినిధిగా మారిపోతాడు. అట్లా నిముషాలు, పావుగంట, అర్థగంట, గంట - ఆఫీసు మహారంగస్థలి అయి సుందర విశ్వనటుడై - ఈ దృశ్యం ఆఫీసులో అందరికీ చిరపరిచితమే - ఇప్పుడా అరలు కూల్చివెయ్యబడి-

* * *

ఇంటిలోకి అడుగుపెడుతూనే, గోడలపైనున్న ఫోటోలలోంచి చాలా మంది 'సుందర'ల కంఠస్వరాలు, పెద్దగా ఫెడేల్ ఫెడేల్‌మని తగులుతున్నట్లుగా - ముఖం పైనా, చెంపలపైనా - అచ్చులు, హల్లులు, పదాలు పరుషమైనవి. తిట్లలాంటివి, దుఃఖంలాంటివి ఒక్కసారిగా సుందరను చుట్టుముట్టాయి. వణుకుతున్న చేతుల్తో, ఒక కప్పు కాఫీతో గదిలో కలదిరుగుతూ సుందర -

పక్కగదిలో అతని భార్య మాయావతి - పజిల్స్, గళ్ళ నుడికట్టు పదాలు ముందు వేసుకొని, చుట్టూ డిక్షనరీలు, పదకోశాలు - ఎప్పుడూ వినని కొత్తపదాలు - పలచటి కత్తులు, వడిసెల రాళ్ళు వగైరా విధ్వంసక శక్తుల్లా.

"1997 ఒక గుర్తు - నా చదువు ఆగిపోయింది. ఉద్యోగంపై ఆశ చచ్చిపోయింది. మనిషిని కుళ్ళిపోవటం మొదలుపెట్టాను. చిత్రహింస - రాజకీయంగా మానసికంగా నేను చంపివెయ్యబడ్డాను. ఎప్పుడూ నాపైన ఏదో దాడి జరుగుతున్నట్లుగా - నైలాన్‌తాడు, కత్తి, యాసిడ్ బాటిల్, నేనూ - తండ్రీ, తండ్రీ నువ్వొ కుక్కిన పేనువు, కొయ్యగుర్రానివి - శవ వాహకుడివి, అసలు నువ్వే ఒక శవానివి" 27 ఏళ్ళ కొడుకు మదన్ నాటకాల్లో ఒక నిముషం పాత్రలా, అప్పుడప్పుడూ కనబడుతూ బాంబులాంటి మాటల్ని ఇంటిపై వదిలేసి - ఈ పదాల దాడితోపాటు ఇప్పుడీ సి.యమ్. బల్లపై పరిచిన స్క్రిప్టు కాగితాల్లోంచి కొత్తకొత్త మాటలు - ఐ.టి.లు, పథకాలు, లోన్లు ఉక్కిరిబిక్కిరి అయ్యాడు సుందర.

రాత్రి పన్నెండు గంటల వేళ, సి.యమ్‌గా మారిపోయాడు సుందర. ఇల్లు చిన్న రంగస్థలం అయిపోయింది. కుర్చీలు, బల్లలు, బట్టల స్టాండు -

పొడవైన ప్రతి వస్తువూ థియేటర్‌లో కూర్చున్న ప్రేక్షకుడిలా మారిపోయి - పాత కార్పెట్టు గది మధ్యలో పరిచి శరీరాన్ని మరో అడుగు ఎత్తు పెంచి ముఖాన్ని పొడవుగా, నునుపుగా సాగదీసి మొత్తం అతని నటజీవితాన్ని ఆ పాత్రలోకి కుందించుకుపోయేలా చేసి -

స్క్రిప్ట్ చాలా కష్టంగా ఉంది. పొడవైన సంభాషణలు, మానరిజమ్స్, నడక అన్నీ కుదిరాయి. అంకెలు, పథకాలు అన్నీ కంఠతా వచ్చాయి. కానీ ఆ ఒక్కటే, కోపం వచ్చినప్పుడు కంఠస్వరం పెంచి మెడపైన రక్తనాళాలు ఉబ్బి, ఒక ప్రచండమైన కేకలా - ఆ కేక, అతని గొంతులో పలకటం లేదు. గంటల తరబడి ప్రాక్టీసు చేసినా ఆ కేక నియంత కోపం అధికారదర్పం వగైరాలు కలిసిన ఆ కేక సుందరకు సాధ్యం కావటంలేదు. సుందరకు ఇదొక దిగులు, ఆపద. మరో గదిలో క్రాస్‌వర్డ్ పజిల్ చేసుకొంటూ మాయావతి, మందపాటి కళ్ళద్దాలు, కొద్దిపాటి వినికిడి లోపం - అతనితోపాటు రాత్రి పొడవునా మేల్కొని, మధ్యలో రెండుమూడు సార్లు టీ యిచ్చి - మాయావతి గత వారంరోజులుగా హిందూ క్రాస్‌వర్డ్ పజిల్‌లోని 'HOWL' అనే పదానికి సమానార్థం వెతుకుతూ - చిత్రంగా ఆ ఇద్దరూ కేకల గురించి వెతుకులాడుతూ ఆ రాత్రిని గడిపేశారు.

ఆ కేక కోసం సుందర పోలీస్‌స్టేషన్లు, సెషన్స్ జరుగుతున్న కోర్టులు, టీవీ అసెంబ్లీ ప్రసారాలు, మార్కెట్టు, జనరల్ హాస్పిటల్, కవుల సభలు, రైల్వే బోగీలు, కబేళా, మందిరం, చర్చి గంట, ఛాయ్ హోటళ్ళు - చివరి ప్రయత్నంగా స్మశానానికి కూడా వెళ్ళాడు. వర్షపు మబ్బు, ఎర్రటి తూర్పు, కొమ్మలన్నీ నరకబడ్డ చెట్టు, ఉరుములు, ఒంటరి పక్షులు - వెతుకులాట పూర్తి కానేలేదు.

లాడ్జి సెంటరులో పోలీస్‌స్టేషన్ వెనుక సందులో ఉన్న చెప్పుల షాపు గుర్తుకొచ్చింది సుందరకు. లాజరు గుర్తుకొచ్చాడు. "చచ్చిపోయి తిరిగి లేచినవాడు ఈ లాజరు!" అంటూ చేతులు ఊపుతూ గొప్పగా అభినయించే లాజరు - పదేళ్ళు దాటింది అతన్ని చూసి. లాజరు సుందరకో సెంటిమెంటు. ప్రతి నాటకం ముందు ఆ షాపులో కాసేపు గడిపేవాడు. ఎన్నో కష్టమైన సీన్లు అక్కడే డిజైన్ చేసుకొన్నాడు. అవార్డులు సంపాదించుకొన్న చాలా పాత్రలు అక్కడ పుట్టినవే.

పదేళ్ళ తరువాత ఇప్పుడు ఇలా 'షూ రిపేర్ షాపు' ఇంగ్లీషులో రాసుంది పేరు. లాజరు పాంటు, షర్ట్, కళ్ళజోడు పరమ ఆధునికంగా ఉన్నాడు. సుందర లోనికొస్తూనే అతనికి ఎదురెళ్ళి, రెండు చేతుల్ని కళ్ళకు అద్దుకొన్నాడు. సుందర చెప్పులు అందుకొని పాలిష్ చెయ్యటం మొదలుపెట్టాడు. షాపు ఖాళీగా ఉంది.

హఠాత్తుగా సుందర లేచి నిలబడి పాత్రను బయటకు లాగాడు. ముఖాన్ని సాగదీసి, నుదిటిని వెడల్పు చేసి, శరీరాన్ని కుంచింపజేసి, నిలువుగా నిటారుగా, అధికారంగా మారి – డైలాగులు చెప్పటం మొదలుపెట్టాడు. లాజరు కళ్ళలో గొప్ప వెలుగు. పరవశం, ఆనందం. లాజరు సుందర చేతుల్ని అందుకొని కళ్ళ కద్దుకొన్నాడు. అప్పుడు ప్రయత్నించాడు సుందర. పొగరు కలిగిన, అధికారపు కేక. స్వరాన్ని పెంచి, ఒక కోపాన్ని ముఖంపై పులిమి, ఊపిరి గట్టిగా పీల్చి, "లాజరూ, లేచి రమ్ము!" అంటూ – ఊహు! నీళ్ళకుండ దబ్బుమని పగిలినట్లు, గొంతులోంచి కేక రాకుండా గాలి ఏదో బుసబుస బయటకు వచ్చినట్లు – సుందర ముఖం నల్లగా మారింది. దిగులుగా కుర్చీలో కూల బడ్డాడు. "అయ్యా! ఈ అరుపు అవసరమా? అధికారాన్ని ప్రదర్శించడానికి ఇట్లా ఒక పెనుకేక, గద్దింపు అవసరమా? ఈ మాటలనే ప్రభువు ఎంత దయగా, ఎంత ప్రేమగా, ఎంత అద్భుతంగా పలికాడు. ఆయనకంటే గొప్ప అధికారా ఈ పాత్ర" అన్నాడు. లాజరు చెప్పిన ఫిలాసఫీ సుందరకు బోధపడలేదు. "ఇది కొత్త దేవుళ్ళ రాజ్యం. ఇక్కడ అరుపులు, గద్దింపులు, నాటకాలు, ప్రదర్శ నలు – ఇవే అధికారానికి సింబల్స్' అని క్షణం ఆపి "లాజరూ! ఆ ఒక్క అరుపు నా గొంతు పలకలేక పోతుందెందుకో" అన్నాడు దిగులుగా. లాజరు ముఖంలో ఓదార్పు ఉందిగానీ, సమాధానం లేదు.

సీనియర్ నటుడు, రంగస్థల మాంత్రికుడిగా పేరు మోసిన కపిల మాధవుని దగ్గరకు బయలుదేరాడు సుందర. ఊరి చివర ఎక్కడో ఉంది అతనిల్లు. ఎండ తీవ్రతలేని జూలై నెల హఠాత్తుగా సెగలు చిమ్మటం మొదలు పెట్టింది. "పాములాగా చుట్టుకుందీ ఎండ, బుసకొడుతూ, కాటువేస్తూ...." అని విసుక్కొన్నాడు సుందర.

గోడల నిండా పోస్టర్లు, వాటిపై చప్పుడు చెయ్యని సంతకాలు. వంద లుగా కళ్ళు వాటిపై నుంచి ప్రయాణిస్తూ – కొత్తగా పోలిక పట్టలేని ముఖాల పోస్టర్లవి. కొత్త అక్షరాలు, కొత్త గ్రామరు. ఎవరెవరివో ముఖాలు. ఇంకెవరివో శరీరాలు. పిడికిళ్ళు విడిపోయి, చేతులకు లాప్‌టాప్‌లు, నోట్లకట్టలు, కోక్ సీసాలు వేలాడుతున్నాయి. "ఈ పోస్టర్లను చించివేసే వాళ్ళు, అడ్డుకొనేవాళ్ళే కనబడటం లేదు" అనుకొన్నాడు సుందర దిగులుగా. ఇదివరకు రోడ్డుపై కేకలు వేసుకొంటూ, నినాదాలిచ్చుకొంటూ కుర్రవాళ్ళు ఈ పోస్టర్లను అడ్డుకొనే వాళ్ళు. ఇప్పుడంతా పోస్టర్లు అతికించేవాళ్ళే. నడుస్తూ నడుస్తూ ఒకడు ఖాళీ గోడకు పేస్టు పూసి, పోస్టరువేసి – అదో హుకుం, ఆజ్ఞాపత్రం – పైనొక పోస్టరు మీద తన స్తనాల్ని రెంటిని ఊడదీసి గోడకు అంటించి వెళుతుందో అమ్మాయి.

కాసేపటికి ఆ స్తనాలకు నల్లరంగు పూసి - ఇది మన సంస్కృతికి వ్యతిరేకం, ఖబడ్దార్! అంటూ మరో పోస్టర్. చాలారోజుల క్రితం కపిల మాధవుడి కొడుకు వీధులలో, మహావేశంతో పోస్టర్లను చించివేయటం గుర్తుకొచ్చింది సుందరకు. ఒక సాయంకాలం చౌరస్తాలో ఒక మూల నిలబడిన ఆ కుర్రవాడి వీపుపై కత్తి ఒకటి సర్రున - మరొకటి తలపై, మరొకటి ఛాతీపై - గోడల నిండా రక్తం చిమ్మటం "నాయనా! మోహనా! మోహనా!" అంటూ కపిల మాధవుడు ఆ చౌరస్తాల మధ్యన కూలబడి రోదించడం గుర్తుకొచ్చింది సుందరకు.

చుట్టూ చెట్లు, పొదలు - రెండు గదుల ఇల్లది. తలుపు తీసే ఉంది. మనిషి అలికిడి లేదు. రూమ్ నిండా పుస్తకాలు, స్టేజి కర్టన్లు పాతవి, గోడల చుట్టూ వేలాడదీసి, టేబుల్‌పై మందు సీసాలు, టాబ్లెట్లు -

"ఎవరూ?" కపిల మాధవుని గొంతు, గంట మోగినట్లు.

"సుందరను. నాటకాల మనిషిని."

"దుఃఖం, సుందరా! మరణపు దుఃఖం' అన్నాడు రుద్ధమైన కంఠంతో కపిల మాధవుడు. కంగారుపడ్డాడు సుందర. "కొన్ని థియేటర్ టిప్స్ కోసం వచ్చాను" అన్నాడు.

"చెప్పానుగా మరణపు దుఃఖంలో ఉన్నానని, రక్తపు వాసన తెలియటం లేదా? ఓర్చుకొనే శక్తి తగ్గిపోతుంది. అలిసిపోయాను" ఒక ధోరణిలో మాట్లాడు కొంటూ పోతున్నాడు కపిల మాధవుడు.

"ఒక కేక, అధికార దర్పంతో, కోపంతో వేసే కేక, లేదా గద్దింపు - అది ఎంతకీ పట్టుబడటం లేదు. ఇంకో వారంలోనే నాటకం" సుందర విషయం బయటపెట్టాడు. నాటకాన్ని వివరించాడు.

విషయం అర్థమయినట్లు, తల పంకించి, లోపలికి వెళ్ళి ముఖం కడుక్కొని వచ్చి పౌడరు పూసుకొని, జుట్టు దువ్వుకొని, నిటారుగా, ఠీవిగా అయి - తుపాకి పేలినట్లు గొంతు విప్పాడు కపిల మాధవుడు.

"నేను ఒథెల్లోని! మాక్‌బెత్‌ని! పోలీనియస్‌ని! సమస్తమైన నియంతలకు ప్రాణం పోసిన షేక్స్‌పియర్‌ని! నేను చరిత్రను, హిట్లర్‌ని, ముస్సోలినీని, నేను వర్తమానాన్ని, నేను అధికారాన్ని, సమస్తాన్ని, మృత్యువుని, ఒంటరిని - తెలియటం లేదా?" అంటూ ఉగ్రంగా, పరమ క్రోధంగా, మహాగర్జనలా అరిచేడు.

భయంతో బిగుసుకుపోయాడు సుందర. ముఖం నిండా చెమటలు. మృత్యువును, ఒంటరిని అనే మాటలు గోడలకు, ఇంటి పైకప్పుకు తగిలి, రీసౌండ్ అయి, మళ్ళీ మళ్ళీ వినిపించసాగాయి. అతనికి ఎదురుగా నిలవలేక పోయాడు సుందర. "థ్యాంక్స్" అంటూ సన్నగా గొణిగి పరుగెడుతున్నట్లుగా

బయటకు నడిచాడు సుందర. "ది ఐల్ ఈజ్ ఫుల్ ఆఫ్ నాయిజ్...." షేక్స్‌పియర్ నాటకంలోంచి డైలాగులు, మంత్రోచ్ఛారణలాగా, ఆ ఇంటిలోంచి చాలా దూరం వచ్చేదాకా వినబడుతూనే ఉన్నాయి.

* * *

రిజిష్టారు ఆఫీసు, పురాతనమైన కట్టడం, బహుశా బ్రిటిష్ కాలంనాటిది. ఆ రోజుల్లో అదో రాతి కట్టడం. బహుశా అదో చర్చి అయ్యుంటుంది. చర్చి చుట్టూ కొన్ని ఇళ్ళు. ఆ ఇళ్ళు చుట్టూ రోడ్డు - అదంతా అద్భుతమైన ప్రణాళికలా ఉండేది. బహుశా ఆరోజుల్లోనే చర్చి క్రమంగా ఆఫీసుగా మారి ఉంటుంది. చర్చిల కుండే స్వేచ్ఛా వ్యవస్థ ఆఫీసులకు ఉండదు. తలుపులు మూసివేసి, లేదా తలుపుల్లోంచి ప్రవేశం నిషేధించి, బహుశా ఒక రహస్య ప్రణాళిక. వంద యేళ్ళుగా కొనసాగుతున్న రహస్య ప్రణాళిక. ఈ రహస్య ప్రణాళికలో భాగంగా అరలు అరలుగా ఫైళ్ళను పేర్చటం, తలుపులకు సీళ్ళు వేయటం, రికార్డుల గదుల్లోకి ఉద్యోగుల నిషేధం - ఈ రహస్య ప్రణాళికలో భాగంగా ఇప్పుడు రికార్డులన్నీ కంప్యూటర్ డిస్క్‌లోకి ఎక్కించటం - ఈ రహస్య ప్రణాళికలో భాగం, ఉద్యోగులను తీసివేయటం లేదా రిటైర్ చెయ్యటం - బహుశా ఒక కంప్యూటరు, ఒక అధికారి - బహుశా ఒట్టి కంప్యూటరే పూర్తి అధికారిగా మిగిలిపోవటం -

నాటకం, ఇంకా అయిదు రోజులుండనగా సుందర ఒకరాత్రి రిహార్సల్ ఆపివేసి హడావుడిగా రోడ్డుపైకి వచ్చాడు. ఆఫీసుకు వెళ్ళి, రికార్డు రూమ్ తెరిచాడు. రహస్య ప్రణాళికలో భాగంగా ఆ తలుపు తీయటం నిషేధం, నేరం. రహస్య ప్రణాళిక అతిక్రమించి ఆఫీసులో అడుగుపెట్టాడు. అరలన్నీ ఖాళీ చేయబడ్డాయి. రికార్డులన్నీ నేలపై గుట్టలు గుట్టలుగా ఉన్నాయి. రికార్డుల మధ్య ఒక పెద్ద సూపర్ కంప్యూటర్ - కొత్తగా ప్రవేశించిన అధికారిలా కూర్చుని ఉంది.

రహస్య ప్రణాళికను అతిక్రమించటం సుందర ఉద్దేశం కాదు. తన పాత్రను రక్తి కట్టించే నటుడిగా - అధికారపు కేక అనుకరించలేని అశక్తితో, అశాంతితో సుందర రికార్డు రూమ్ తెరిచాడు. ప్రముఖుల జననాలు, వాళ్ళ గురించిన వివరాలున్న ప్రత్యేకమైన రికార్డులు తెరిచాడు. రాజకీయ నాయకులు, సైన్యాధికార్లు, నటులు, గాయకులు, క్రీడాకారులు, రచయితలు, రేపటి కలల ఉద్యమకారులు, హంతకులు, కోట్లు గడించినవాళ్ళు, మిస్ యూనివర్స్‌లు, వాళ్ళ గురించిన వివరాలున్న ఫైళ్ళు - అన్నింటిని టేబుల్‌పై

పరిచి, ఒక్కో పేజీని చదవటం మొదలుపెట్టాడు. ఒక్కొక్క పేజీని తీస్తున్నకొద్దీ చరిత్రలోకి ప్రవేశిస్తున్న అనుభవం - ఆ వ్యక్తులు, వాళ్ళ జీవిత చరిత్రలు సుందర ముందు ప్రత్యక్షమయ్యాయి. సుందర గాంధీగా మారాడు. బళ్ళారి రాఘవ, సుందర త్యాగరాజు అయ్యాడు. కోడి రామమూర్తి, ఒకానొక బ్రిటీష్ గవర్నర్ కూడా అయ్యాడు. సుందర టుంగుటూరి ప్రకాశంపంతులు అయ్యాడు. సుందర చనిపోయిన కపిల మాధవుని కొడుకు అయ్యాడు. సుందర సుదీర్ఘమైన చరిత్ర అయ్యాడు. ఒక్కొక్క పాత్రనే అనుకరిస్తూ వాళ్ళలా నడిచి, వాళ్ళలా మాట్లాడి, వాళ్ళలా నవ్వి, ఏడ్చి చివరకు వాళ్ళలా మరణించి - రాత్రంతా సుందర ఈ పరకాయ ప్రవేశంలోనే గడిపాడు. అయితే అంతమందిలోనూ సుందర వెతికే కేక, అధికారపు కేక లేదా గద్దింపు కనబడలేదు. హతాశు డయ్యాడు. తొలిపొద్దు పొడిచింది. వెలుగు కమ్ముకు వస్తుంది. ఇంకా చాలా రికార్డులు మిగిలిపోయాయి. కంప్యూటర్, రాక్షసమాయలా నిబ్బరంగా చూస్తుంది. నిరాశగా తలుపులన్నీ మూసి బయటకు వచ్చాడు సుందర.

* * *

నాటకం ఇంకా మూడు రోజులుందనగా ఆ రాత్రి సుందరకు ఒక కల వచ్చింది. స్టేజీపైన నాటకం. నాటకంలో సి.యమ్‌గా సుందరం. గంభీరంగా అభినయిస్తూ 'నేనుసి.యమ్‌ని' అంటూ కేక వెయ్యబోయాడు. అతని శరీరం బిగుసుకుపోవటం మొదలుపెట్టింది. చెయ్యి పైకెత్తబొయ్యాడు. కదలలేదు. నోరు తెరిచి అరవబోయాడు. కండరాలు పట్టేశాయి. అడియన్స్ నుంచి కేకలు, అరుపులు. భయంతో వెనక్కు తిరిగాడు. అతని శరీరం పొడవునా బాయ్‌నెట్లు దిగబడి. కర్టెన్ వెనుక వందలాదిగా పోలీసులు. ఉలిక్కిపడి భయంతో లేచాడు సుందర.

* * *

నాటకం ఇంకా రెండు రోజులుందనగా, ఆ రాత్రి కూడా నాటకం గురించి కలగన్నాడు సుందర. సి.యమ్ పాత్రలో సుందర. స్టేజీపై గోల్ఫ్ ఆట. ప్రచండమైన వేగంతో బంతిని కొట్టి. బంతి నుంచి ఒక పెనుకేక. కిందకు వంగి చూస్తే అది బంతి కాదు. సుందర తల.

* * *

"మిత్రుడా, సుందరా, నువ్వు మళ్ళీ పుట్టినవాడివి. చాలాసార్లు పేర్లు మార్చుకొన్నవాడివి. నువ్వు ఇంకా నేర్చుకోటం పూర్తికాని పాఠానివి" నిద్ర లేస్తూనే

కలలోని సుందరతో సంభాషించాడు సుందర. లేచి యూనిఫారం తగిలించు కొన్నాడు. బుష్ షర్ట్, షూ, టై - సియమ్‌గా మారిపొయ్యాడు .గది మధ్యలోనే ఒక పేషీని, ఆఫీసుని కొలువు తీర్చాడు. "ఎవర్రా అక్కడ?" అంటూ పెద్దగా అరిచాడు. మాయావతి, వారంరోజులుగా వదలని హిందూ క్రాస్‌వర్డ్ పజిల్, మందపాటి కళ్ళద్దాలు, చేతుల్లో డిక్షనరీలు - "ఏవండీ పిలిచారా!" అంటూ వచ్చింది.

"మీ సమస్యలేమిటి చెప్పండి" సీరియస్‌గా అడిగాడు సుందర.

"పజిల్, ఇదే నా సమస్య. HOWL అనే మాటకు దగ్గరి పదాలు దొరక్కపోవటం నా సమస్య. HOWL, FOWL, JOWL దేన్ని గడిలోకి ప్రవేశ పెట్టాలో అర్థం కావటంలేదు. మీ పలుకుబడి ఉపయోగించి డిక్షనరీలో 'OWL' తో అంతమయ్యే పదాలన్నిటినీ, నా ఎదురుగా వచ్చి నిలబడమని ఆదేశిం చండి" అంది ఎంతో వినయంగా.

తను కోపం తెచ్చుకోవడానికి, కేక వెయ్యడానికి అది సరైన సందర్భం లాగే తోచింది సి.యమ్ అయిన సుందరకు. "వచనం చదవటం ఆపెయ్యి. కఠినమైన సత్యాల్ని అర్థం చేసుకో. HOWL అనే మాటను మర్చిపో. గాట్, డబ్ల్యు.టి.ఓల మధ్య ఒకదాన్ని ఎంచుకో. అనార్కిజాన్నో, సాంస్కృతిక మర ణాన్నో ఒకదాన్నే తేల్చుకో" అని పెద్దగా అరవబోయి - మరోసారి తీగ తెగింది. గొంతు పైన గాయం బాగా లోతయింది. శరీరంలో సన్నని వణుకు. ఆవేళ కూడా సి.యమ్ కోసం కేకను సాధించలేకపొయ్యాడు సుందర.

"అంకుల్! అంకుల్! మీ మదన్ బ్రిడ్జ్ మీద నుంచి కిందకు దూకే శాడు" బయట కుర్రవాళ్ళు కంగారుతో అరుస్తున్నారు. ముందది నాటకంలోని సన్నివేశం అనుకొని పట్టించుకోలేదు వాళ్ళిద్దరు. ఒక నిముషం అయినాక "నాయనా! మదనా!" అని అరుచుకొంటూ మాయావతి రోడ్డుపైకి పరిగెత్తింది. సి.యమ్ వేషాన్ని విప్పివెయ్యటం మొదలుపెట్టాడు సుందర. సుందరను త్వరగా బయటకు లాగి అతన్ని వెంటనే దుఃఖపడమని, కంగారుపడమని ఆదేశించాడు సుందర.

మదన్ శరీరం - ఆకాశంపై నుంచి కిందకు జారి, మధ్యలో ఆగి రైల్వేబ్రిడ్జి నుంచి పూర్తిగా నేలపైకి జారకుండా టెలిఫోన్ తీగల మధ్య ఇరుక్కు పోయింది. "మదన్! మదన్!" బ్రిడ్జి పక్కన నిలబడి సుందర అరుస్తున్నాడు. ఎర్రటి ధూళి, తగలబడుతున్న నేల, భయం, దుఃఖం - లోపల దాగున్న కథ లన్నీ అరుపులుగా బయటకు వచ్చాయి. అట్లా ఒక గంటసేపు అరుస్తూనే

ఉన్నాడు సుందర. ఆ అరుపులోంచి సుందర వారంరోజులుగా వెతికే కేక కూడా బయటపడింది.

"ఇవాల్టితో ఉద్యోగం వచ్చే వయసు అయిపోయింది. దాన్ని గుర్తు చేసుకోవడానికి ఈ మిస్ ఎడ్వెంచర్!" అన్నాడు మదన్, నలుగురు రైల్వే కూలీలు తీగల మధ్య నుంచి అతన్ని కిందకు దించినాక.

"మీ గొంతులో HOWL పలికింది. నా పజిల్‌లోని HOWL కే సరైన మాట దొరకలేదు" అంది మాయావతి నిరాశగా ఇంటికి వచ్చిన తర్వాత.

"గుండెలు అవిసిపోయేలా కేకలు పెట్టారు. ఆ కేక మీదా ? మీలోని నటుడిదా?" అంది మాయావతి తర్కిస్తూ.

సుందర ఏం మాట్లాడలేదు. అతని కళ్ళముందు నటులు, నాయకులు, నియంతలు, బోధిసత్వులు ఎందరో తళుక్కుమన్నారు. లాజరు గుర్తుకొచ్చాడు. కపిల మాధవుడు కూడా.

ఒక కేక ఒంటరిగా, ఏకాకిలా అతని చుట్టూ ప్రతిధ్వనిస్తూనే ఉంది.

*- ఆదివారం వార్త, 22 జూలై 2001*